# జాలి

ఎ. జయలక్ష్మీ రాజు

"అయ్యో! ఎంత పని జరిగింది? చ్చొ! చ్చొ! చ్చొ!" ఎదుటివారికి కాస్త కష్టం వస్తే చాలు! ఇలాంటి మాటలూ, ధ్వన్యనుకరణలూ ప్రతివారి నోటా అప్రయత్నంగా వస్తూంటాయి! జాలి ఎప్పుడూ అందంగానూ, ఆనందంగానూ వుండదు! తమమీద ఎవరైనా జాలి పడుతున్నారూ అని గ్రహించగానే అంతకంటే నరకం ఇంకోటి లేదన్నట్టు ఫీలయిపోయి ఎవ్వరూ జాలిపడకుండా, చాలా జాగ్రత్తపడతారు కొందరు. ఈ విషయం శ్వేత మా ఇంట్లో అద్దెకున్నన్ని రోజులూ గ్రహించలేకపోయాను నేను!

చాలా ఏళ్లబట్టి నాకో కోరిక ఉండేది. స్వంత ఇల్లు కట్టుకోవాలనీ, ఓ పోర్షను అద్దెకిచ్చి ఇంటి ఓనరు అని నలుగురితో పిలిపించుకోవాలనీ. పట్టుబట్టాలే కానీ పడతులకు సాధ్యం కానిదేముంటుంది అనుకుని పతిదేవుని చెవిలో నా కోరిక ఊదాను. షాక్ కొట్టినట్టు అదిరిపడ్డారు. 'చంద్రమండలానికి వెళతావా టికెట్ బుక్ చేస్తాను, ఇల్లు కట్టాలన్న కోరిక మాత్రం కోరకు! అది కైకేయి కోరిక కంటే కూడా భయంకరమైనది. ఇల్లంటే మాటలా? ఒక్కడిని సంపాదించాలి. నలుగురు భోంచేయాలి. పోనీ నీవైపు నించో, నావైపు నుంచో పెద్దల ఆస్తి కలసి వచ్చిందా? మా భాగానికి ఓ తోట, ఓ లక్ష, పదెకరాల మాగాణి వచ్చాయి. రిస్కు లేకుండా హ్యాపీగా బ్రతికేస్తున్నాం. ఓ ఇల్లు కట్టుకునే ప్రయత్నం నిర్భయంగా చెయ్యొచ్చు అని వళ్లు విరుచుకుంటూ చెప్పుకుందామన్నా, రెండువైపులా గొర్రె తోక జీతం రాళ్లు! బీద అరుపులూ నాయె!" అంటూ మావారు నా తల మీద అయిసు ముక్క పెట్టబోయారు.

"మావాళ్లు నాకిచ్చిన బంగారం అమ్మేద్దాం. ప్రావిడెంటు ఫండులోను, యల్.ఐ.సి.లోను పెడదాం. అదీ చాలకపోతే మా అన్నయ్య నడిగి అప్పు తెస్తాను" అంటూ మొండి పట్టు పట్టాను. ఎలాగైతేనేం శ్రీవారిని ఒప్పించాను. చవకలో ప్లాటు కొన్నాం. ఓ వంద తెల్ల కాగితాలు నల్లగా చేసి ఇంటి గుర్చి ప్లాను వేసుకున్నాము.

చిన్న గదులతో రెండు పోర్షన్లు కట్టుకున్నాము. బోరు వేయించాము. కాంపౌండు కట్టించి గేటు పెట్టించాము. చివరి కోరిక తప్ప అన్నీ పూర్తయ్యాయి. ఆ కోరిక తీర్చుకునే నిమిత్తం గేటుకు "టులెట్ బోర్డు" పెట్టించాము. బాదర బందీ లేని వాళ్లకు అద్దెకివ్వాలి అనుకున్నాము.

గతంలో అద్దెకున్న ఇళ్లల్లో పడ్డ అగచాట్లు గుర్తుకు తెచ్చుకుని, ఇంటి ఓనరు కుండాల్సిన లక్షణాలను మననం చేసుకున్నాను. 'గోడకు మేకులు కొట్టరాదు, గట్టిగా మాట్లాడకూడదు, ఘాటు వచ్చేలా వంటకాలు వేయించకూడదు. ఓనర్లకు ప్రతి విషయంలోనూ సాయపడాలి! నీళ్లు రెండు రోజులకొకసారి నింపుకోవాలి! పిల్లలు అల్లరి చెయ్యకూడదు! అద్దె పెంచితే కిమ్మనకూడదు. అద్దె డబ్బు ఒకటో తేదీ సాయంత్రం అయిదు గంటలకు ఠంచనుగా అందాలి' ఇలా నా షరతులన్నీ ఇల్లు కావాలని వచ్చిన వారందరికీ వినిపించాను.

నెల రోజుల్లో ఓ పదిమంది దాకా వచ్చి వెళ్లారు. కానీ, నా షరతుల పట్టీ వినగానే, మొహం అదోలా పెట్టి కొందరు, ఎగాదిగా చూసి కొందరు వెళ్ళిపోయారు. ఒకావిడైతే ఏకంగా 'మీ వంశంలో అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు స్వంత ఇల్లున్న ఛాయలు లేవు. ఇప్పుడు మీరు చచ్చీ చెడీ ఇల్లు కట్టించుకున్నట్టున్నారు. అందుకే మరీ పెట్రేగిపోతున్నారు' అంటూ మొహాన్నే అనేసి చక్కా పోయింది. నాకు దిగులు పట్టుకుంది. ఇల్లు అద్దెకిస్తే డబ్బు కాస్త కలసి రావటమే కాక, నా చిరకాల వాంఛ ఈడేరుతుందనుకుంటే, ఇలా బెడిసి కొడుతుందేమిటబ్బా అని బాధపడ్డాను. అద్దె ఇంటి గుర్చిన షరతుల్లో సడలింపు ఉండాలని నిర్ణయించుకున్నాను.

ఓ వారం పోయాక ఒక యువతి ఇల్లు కావాలంటూ వచ్చింది. ఆవిడ గుర్చి వివరాలడగలేదు. నా షరతుల పట్టీ విప్పలేదు. అద్దె మాత్రం చెప్పాను. అడ్వాన్సు ఇచ్చి వెళ్లిన మరుసటి రోజే సామానుతో దిగింది!

"హమ్మయ్య! నేనిప్పుడు ఇంటి ఓనరునయ్యాను" అనుకుని మురిసిపోయాను. ఓ వారం రోజులు నన్ను నేను మరచిపోయి హాయిగా గడిపాను.

ఆ తర్వాత మనసులో ఆవిడ గుర్చి అనుమానాలు మొదలయ్యాయి. ఆరాలు మొదలుపెట్టాను. ఆవిడ పేరు శ్వేత. వయసు ముప్పైలోపు. పేరులాగే మనిషి తెల్లగా, అందంగా, పెద్ద బారు జడతో చెరగని చిరునవ్వుతో ముచ్చటగా ఉంటుంది. ఉదయం పదిలోపు పనులు పూర్తి చేసుకుని ఇంటికి తాళం వేసి వెళితే మళ్లీ సాయంత్రమే రాక! వండుకుంటే వండుకుంటుంది, లేకుంటే బజారు నించి తెచ్చుకున్న ఏ బ్రెడ్డు ముక్కో తిని పడుకుంటుంది. అయిన వాళ్లెవ్వరూ లేనట్టున్నారు. సంధ్య అన్న పేరుగల యువతి మాత్రం వారానికి రెండుసార్లు వస్తూండేది. ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకునేవారు. కలిసి వెళ్లేవారు. అంతకు మించి ఇంటికెవరూ రారు. ఇక ఉత్తరాల సంగతి సరేసరి. ఆవిడ మా ఇంట్లో ఉన్న సంవత్సర కాలంలోనూ ఒక్క ఉత్తరం వచ్చిన పాపాన పోలేదు! ఆవిడ మా ఇంట్లో చేరిన రెండు నెలల వరకూ మామధ్య చనువు పెరగలేదు! ఏవో పొడి మాటలు మాత్రం మాట్లాడి ఊరుకునేది. శ్వేతకు పెళ్లయ్యిందా? లేదా? ఈ ప్రశ్నకు జవాబు దొరికేదాకా ప్రాణం నిమ్మళించేలా లేదు.

శ్వేతను డైరెక్టుగా అడగటానికి జంకుగా వుంది. ఓ రోజు మావారితో "మనింట్లో అద్దెకున్నావిడను చూశారా?" అన్నాను.

"ఏం?" అన్నారాయన.

"అబ్బే! ఏం లేదు ఆవిడ అందంగా ఉంది కదూ?" అన్నాను ఎలా మొదలుపెట్టాలో తోచక.


"అలాగా. ప్రపంచంలో కళ్లారా అందాలను చూసి పదేళ్లు దాటింది కదోయ్! నిన్ను కట్టుకున్నాక నా కళ్లు స్వతంత్రం కోల్పోయాయి. పెరట్లో విరగబూసిన మల్లెచెట్టు వైపు తనివితీరా చూసినా, మనసారా మెచ్చుకున్నా పోట్లాటకు దిగుతావు కదా! అద్దెకున్నావిడ అందంగా ఉంది కదూ అంటూ నన్ను క్రాస్ ఎగ్జామిన్ చేసి పడగొట్టాలనా నీ ప్లాన్. అసలావిడను చూడ్డానికి నాకెలా వీలవుతుంది. నాకు నైట్ డ్యూటీ. ఆవిడకు పగటి డ్యూటీ. సెలవు దినాల్లో టి.వి.కి వెలుతురు పడుతోందన్న నెపంతో

కిటికీలు, తలుపులూ వేసి ఇంట్లో కూర్చోబెడుతున్నావు. నా భార్య చాలా తెలివైనది. బహు జాగ్రత్తపరురాలు అని నేను అనుకోని నిమిషంలేదు'' అన్నారు వెటకారంగా.

"సర్లెండి! ఊసుపోని కబుర్లు. నేను చెప్పేది వినండి. ఆవిడ మెడలో తాళిబొట్టు లేదు. కాళ్లకు మట్టెలు లేవు. ముఖాన మాత్రం చిన్న చుక్కలాంటి బొట్టు పెట్టుకుంటుంది. మీకేమనిపిస్తోంది?'' అన్నాను.

"రేపు నెల జీతం రాగానే ఇంట్లోకి ఒక్క పైసా వాడకుండా, ఆవిడకి ఓ జత మట్టెలు, మంగళసూత్రాలు తెప్పించి ప్రెజెంట్ చేస్తే బావుంటుందనిపిస్తోంది'' అన్నారు.

"నేను సీరియస్‌గా మాట్లాడుతుంటే మీకు ఎగతాళిగా ఉందా ఏం? ఆవిడకు పెళ్లయిందా? కాలేదా? పెళ్లయి భర్త పోయాడా? పాపం



శమించుగాక. మిస్టరీ వీడక తలబద్దలవుతూంటే, మీకు పరిహాసంగా ఉందా?'' అన్నాను అసహనంగా.

"చూడు సుమిత్రా. ఆవిడకు పెళ్లయితే నీకెందుకు? కాకుంటే నీకెందుకు? భర్త చనిపోతే మాత్రం నీవు చేసేదేముంది. ఆవిడ సమస్యలు మనవరకూ రానంతవరకు మనకవసరం లేదు. తన మనాన తాను ఉద్యోగం చేసుకుంటోంది. మనింట్లో అద్దెకుంది. అద్దె సక్రమంగా చెల్లిస్తోంది. మాట్లాడాలనిపిస్తే స్నేహంగా మాట్లాడు. లేకుంటే నీ పని నీవు చూసుకో. ఊరికే అనవసరపు ఆలోచనలతో బుర్రపాడు చేసుకోకు. అసలింకా నన్నడిగితే ఆవిడను చూసి నీవు చాలా నేర్చుకోవాలి. కరెంటు పోతే గావుకేక పెడతావు. ఒంటరిగా ఎంత ధైర్యంగా బ్రతుకుతుందో చూడు. ఆవిడ దగ్గర సంస్కారహీనంగా మాట్లాడి ఆమెను బాధపెట్టేవు సుమా'' అంటూ హితబోధ లోనే వార్నింగ్ డోసు కలిపి ఇచ్చారు.

అప్పటికి ఊరుకున్నాను. వేసవి సెలవులకని ఊరెళ్లిన మా పాప, బాబు వచ్చారు. ఒక్క రోజులోనే "ఆంటీ'' అంటూ పిల్లలు బేబీ, బాబూ శ్వేతకు బాగా దగ్గరయ్యారు. పిల్లలు మధ్యలో ఉండటం వల్ల మాటలు పెరిగి నాకూ శ్వేతకు చనువు పెరిగింది! తిండి పదార్థాలు పిల్లల ద్వారా ఇచ్చి పుచ్చుకునేంత దాకా స్నేహం పెరిగింది. ఓసారి జీతం రాగానే బేబికి గౌను తెచ్చింది శ్వేత. ఆమెకు బేబీ అంటే చాలా ఇష్టం రోజుకో కొత్త రకం జడ వేసి ముస్తాబు చేసేది పాపను.

"గౌను ఎందుకు తెచ్చారు?'' మొహమాటంగా అడిగాను. నిజానికి నాకలా ఇతరుల నుంచి వస్తువులు ఉచితంగా తీసుకోవటం ఇష్టం వుండదు.

"నాకు బేబీ అంటే ఇష్టం. బేబిని చూస్తుంటే దూరంగా ఉన్న మా పాప గుర్తొస్తోంది. అన్యథా భావించకండి!'' అంది బాధగా ముఖం పెట్టి.

"మీకు పాప ఉందా?'' అన్నాను ఆశ్చర్యాన్ని దాచుకుంటూ.

"అవునండీ! ఊటీలో చదివిస్తున్నాం. బేబి కంటే చిన్నదే. కానీ వాళ్ల నాన్నగారిలాగా పొడగరి. పదేళ్ల పిల్లలా కనిపిస్తుంది'' అంటూ ఇంట్లోకెళ్లి వాళ్లమ్మాయితో, భర్తతో కలసి తీయించుకున్న ఫోటో తెచ్చి చూపించింది.

"అలాగా! పాపం నాన్నగారెక్కడున్నారు?'' లైన్ క్లియర్ అవటంతో ధైర్యంగా అడిగేశాను.

"ఊటీకి దగ్గరున్న ఊళ్లోనే ఉన్నారు. పాపకి దగ్గరగా ఉండాలని.''

"మీరు అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చుగా?''

'భర్తను పిల్లను చూడకుండా ఎలా ఉంటోంది బాబూ గట్టిదే' మనసులో అనుకున్నాను.

"ట్రై చేస్తున్నానండీ" అంది ముక్తసరిగా.

ఆరోజు నుంచీ శ్వేతకు నాకూ బాగా స్నేహం పెరిగింది. దాదాపు సంవత్సరం పూర్తి కావస్తున్నా శ్వేత ఏ ఊరూ వెళ్లలేదు. ఆమె కోసం భర్త కానీ, కూతురు కానీ రాలేదు. రెండు మూడుసార్లు అడిగాను. టాపిక్ మార్చేయటమో, వారికి సెలవు దొరకలేదనటమో చెప్పి తప్పించుకునేది. కానీ ఆమె ఎక్కడికీ వెళ్లలేదు. శ్వేత మీద ఉత్తి పుణ్యానికే కోపం రాగాసాగింది. చాలా అసహనంగా ఫీలయ్యాను. అసలు ఆ ఫోటోలో అతను స్వంత మొగుడేనా? ఆమెమీద లేనిపోని అపోహలతో నిండింది నా మనసు. మనసులో ఛీత్కరించుకోవటం మొదలుపెట్టాను.

"బేబికి డాన్స్ నేర్పించకూడదా సుమిత్రా! మా పాప ఈ వయసుకే డాన్స్ బాగా చేస్తుందో!" అంది ఓసారి.

"మా పాప కరాటే నేర్చుకుంటోందిట. మావారు ఫోన్ చేశారు. బేబీకి కూడా నేర్పిద్దామా?"

"మా పాపకీ సారి ఫస్టు ర్యాంకు వచ్చిందిట. ఏంట్రా బేబీ కన్నా నువ్వీ మధ్య మొద్దువై పోతున్నావు! ఫిఫ్త్ ర్యాంకు తెచ్చుకున్నావు! షేం! షేం! ఈసారి బాగా చదువు. ఫస్టు ర్యాంకు తెచ్చుకుంటే మంచి ప్రజెంషను కొని తెస్తాను" అంది ముద్దు పెట్టుకుంటూ. నాకామె మాటలు నచ్చటం లేదు.ఆమె కూతుర్ని పొగడుకుంటూ ఉంటే నా మనసు కుళ్లుతో నిండేది! నా కూతుర్ని ఆమె తక్కువ చేసి మాట్లాడుతున్నట్టు ఫీలయ్యేదాన్ని. ఏదోలే పిల్లల విషయం మాట్లాడితే మాట్లాడింది అనుకుంటే.

"సంవత్సరం నుంచి చూస్తున్నాను. సరదాగా మీవారు మీరూ కలిసి సినిమాకో షికారుకో వెళ్లరేంటండీ బాబూ! కన్నుల పండుగ చేసుకుందామంటే గడప దాటరేంటండి బాబూ!" అంటూ దీర్ఘాలు తీయటమే కాక "భార్యా భర్తలన్న తర్వాత మరీ యంత్రాల్లా కాకుండా సరదాలుంటేనే థ్రిల్లు. ఉద్యోగరీత్యా ఇలా దూరంగా బ్రతికేస్తున్నాం కానీ, మా జంటను చూస్తే అసూయపడేవారు!" అంటూ అతిశయంగా మాట్లాడేది!

నాకు వళ్లు మండిపోసాగింది. సంవత్సరం నుంచి మొగుడూ, పిల్లనీ చూడకుండా 'రాయి'లా బ్రతుకుతున్న ఈవిడ 'థ్రిల్లు' గురించి నాకు బోధిస్తోంది! భర్తతో కాపురం ముచ్చట్లు ఈవిడి గారు ఊరించి చెబుతూంటే దద్దమ్మలా వినాలి కాబోలు మేమంతా!

ఆవిడను నేనిక సహించలేకపోయాను. సవాలక్ష కారణాలు చెప్పి ఇల్లు ఖాళీ చేయించి ఊపిరి పీల్చుకున్నాను. శ్వేత వెళ్లేముందు చాలా బాధపడింది! పాపను చూడందే ఉండలేనంది. అద్దె పెంచమంది. కానీ నా మనసు కరగలేదు.

మూడేళ్లు గడిచాయి. మా తమ్ముడి పెళ్లికి వెళుతూ ట్రయిన్ గంట లేటంటే స్టేషన్‌లో ఉసూరుమంటూ కూలబడ్డాను, వచ్చిపోయే జనాన్ని చూస్తూ. ఇంతలో శ్వేత స్నేహితురాలు సంధ్య నాదగ్గరగా వచ్చింది.

"బావున్నారా? దూరం నుంచి చూస్తూ మీరా కాదా అని సందేహిస్తూ వచ్చాను. ఈమధ్య కాస్త వళ్లు చేశారు. అందుకే ఠక్కున గుర్తుపట్టలేకపోయాను" అంటూ నాప్రక్కన కూర్చుని క్షేమ సమాచారాలడిగింది.

"మీ ఫ్రెండు శ్వేత బావుందా? ఊటీకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుందా? వాళ్లమ్మాయి ఏం చదువుతోంది?" అంటూ ప్రశ్నలు వేశాను.

సంధ్య మొహం బాధగా పెట్టింది.

"మీకూ ట్రాన్స్‌ఫర్, ఊటీ కహానీ చెప్పిందా?" అంది.

"కహానీయా?" ఆశ్చర్యంగా ఆసక్తిగా అడిగాను.

"శ్వేత భర్త, కూతురు ఊటీ నించి శ్వేత దగ్గరకు వస్తూండగా యాక్సిడెంటులో చనిపోయారు!" అంది సంధ్య.

"ఎప్పుడు?" అన్నాను బాధగా. నా కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. ఆ వార్త నన్ను చాలా బాధపెట్టింది.


"అయిదేళ్ల క్రితం! అంటే శ్వేత మీ యింట్లో అద్దెకు దిగక మునుపు. ఓ అరు నెలలు శ్వేత చాలా నిరాసక్తంగా జీవితం గడిపింది. ప్రేమించి పెళ్లి చేసుకున్నందువల్ల బంధు వర్గానికి దూరమైంది. భర్త, కూతురు సర్వస్వంగా బ్రతికే శ్వేత, వాళ్లు దూరం కావటంతో, శాస్తి జరిగిందని ఆనందపడే బంధువులతో, అయ్యో! పాపం! అంటూ జాలి చూపులు చూసే సమాజంతోనూ విసిగి వేసారింది. ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. భర్త, కూతురు ఉన్నట్టే అందరితోనూ చెప్పుకునేది. కారణం ఎవరైనా తనవైపు జాలి చూపులు చూడ్డం కానీ, సానుభూతి కురిపించే మాటలను కానీ, భరించలేననేది. నేనామెకు చిన్ననాటి స్నేహితురాలిని కావటంతో, ఆమె జీవితం గురించి నాకు తెలుసు. ఇప్పుడైనా మీకిదంతా చెప్పటం అనవసరం. కానీ శ్వేత మీ యింట్లో అద్దెకున్న రోజుల్లో, ఆమె గురించి అపోహలు, అనుమానాలు మీకుండేవనీ, అవివ్యక్తం చేస్తూ మీరు మాట్లాడేవారనీ శ్వేత చెప్పేది. అందుకే చెప్పాను" అంది సంధ్య.

నా మొహం సిగ్గుతో వాల్చుకోవాల్సి వచ్చింది. "సారీ! సంధ్యా! నాకేవీ తెలియక.... పాపం... శ్వేత జీవితం... ఇప్పుడెలా? అంటూండగానే సంధ్య అడ్డుపడి, "ఆగండాగండి! ఆ జాలి కురిపించే మాటలూ, సానుభూతి చూపులనే శ్వేత ఇష్టపడనిది!అటు చూడండి" అంటూ అప్పుడే వచ్చి ఆగిన ట్రైన్ వంక చూపించింది. ట్రైన్‌లోంచి శ్వేత ఓ నెలల పసికందును పొత్తిళ్లలో పట్టుకు దిగుతోంది! ఆమెను జాగ్రత్తగా పొదివి పట్టుకుని ఓ యువకుడు దిగటానికి సాయం చేస్తున్నాడు! శ్వేత నిండుగా ఉంది. ముఖం మీద చెరగని అదే చిరునవ్వు. అదే ఆత్మ విశ్వాసం.

"అతను?" అన్నాను సంధ్య వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

"అతను ఆమె భర్త! రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ఆమె గతమంతా తెలిసి కూడా, వివాహం చేసుకున్న మంచి మనసున్న వ్యక్తి! శ్వేత ఇప్పుడు హ్యాపీగా ఉంది' అంది సంధ్య.

"తనమీద ఇతరుల జాలిని ఇష్టపని శ్వేత ఎప్పుడూ హ్యాపీగానే వుంటుంది!" మనసులో అనుకుని శ్వేతను మనసారా పలకరించటానికి ముందుకు నడిచాను సంధ్యతో పాటు.



## అతి చిన్న కుక్క!

ప్రపంచంలో అతి చిన్న కుక్క యిది. పేరు థంబలినా. టెర్రియర్ జాతికి చెందిన ఈ కుక్కపిల్ల 8 అంగుళాల పొడవు వుంది. గిన్నెస్ బుక్‌లో అతి చిన్న కుక్కగా చోటు చేసుకుంది. షాంపెన్ గ్లాసులో పట్టే ఈ కుక్క ఇంగ్లండులోని ఎల్టెన్‌లో 59 ఏళ్ళ మారీన్ హెరెసెకు చెందినది. పన్నెండు ఔన్సుల బరువు వున్న యిది, రోజూ తన బరువులో సగం చికెన్, లివర్ ఆరగిస్తుంది.

- ఎం. ఉహ

